ప్రజాశక్తి
సోమవారం 17 జూన్ 2024 కర్నూలు



కల్తీకి చోటు లేకుండా చర్యలు

- లూజ్ విత్తనం వద్దు..ప్యాకింగ్ ఉన్న వాటిని కొనండి
- రైతులకు అందుబాటులో వ్యవసాయ సిబ్బంది ఉండాలి
- ప్రజాశక్తితో జిల్లా వ్యవసాయ అధికారి పిఎల్ వరలక్ష్మి

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

'జిల్లాలో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తన సాగుకు వ్యవసాయ శాఖ నుండి సర్వం సిద్ధం చేశాం, ఎరువులు, విత్తనాలు, అన్ని రకాలుగా రైతులకు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడా కూడా కల్తీకి చోటు లేకుండా గట్టి చర్యలు తీసుకున్నాం. ఇంకా జిల్లాలో తనిఖీలు కొనసాగుతున్నాయి. 'అని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి పిఎల్ వరలక్ష్మి అన్నారు. ప్రజాశక్తితో ఆమె ముఖాముఖిగా మాట్లాడారు...



జిల్లాలో ఖరీఫ్ సాగు ఎంత,ఏ పంటలు ఎంత సాగు చేస్తారు?

జెడి : జిల్లాలో ఖరీఫ్ సాగు 10,48,047 ఎకరాలలో జరుగుతుంది. ఇందులో ప్రధానంగా పత్తి 6,09,222.5 ఎకరాలలో, వేరుశనగ 1,47,422.5 ఎకరాలలో, కంది 63,892 , ఆముదం 23077 ఎకరాలలో, మిరప 74,995 , ఉల్లి 39,245, వరి 31,927, ఇతర పంటలు 58,265 ఎకరాలలో సాగవుతుంది.

రాయితీ విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉన్నాయా?

జెడి : వేరుశనగ క్వింటం 9500 రూపాయలు, రాయితీ 40 శాతం పోగా రైతు చెల్లించాల్సింది 5700 రూపాయలు. జీలుగా 8800 రూపాయలు రాయితీ 50 శాతం పోగా 4400 రైతు చెల్లించాలి. పిలిపెసర రూ.13400, రాయితీ 50 శాతం పోగా 6700 రైతు చెల్లించాలి. అలాగే పత్తి అధికంగా సాగు జరుగుతుంది. జిల్లా వ్యాప్తంగా పత్తి ప్యాకెట్స్ అందుబాటులో ఉన్నాయి. పత్తి ప్యాకెట్ రూ.864 కంటే ఎక్కువ తీసుకుంటే ఫిర్యాదు చేయండి. తీసుకున్న దానికి రసీదు ఖచ్చితంగా తీసుకోవాలి. ఎరువులు యూరియా, డిఎపి అన్నిరకాల ఎరువులకు ఎలాంటి కొరత లేదు.

కల్తీ విత్తనాలు, అధిక ధరలకు ఎరువులు విక్రయిస్తున్నారు. వాటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నారు?

జెడి : జిల్లా వ్యాప్తంగా అన్ని విత్తన, ఫర్టిలైజర్ షాప్‌లలో తనిఖీలు నిర్వహించాము. ఎప్పటికపుడు హెచ్‌టి పరీక్షలు నిర్వహించాము. రెండు విత్తన కార్యాలయాలపై కేసులు నమోదు చేశాము. రైతులు లూజ్ విత్తనాన్ని కొనుగోలు చేయకండి. ప్యాకింగ్, తయారీ తేదీ, వివరాలు ఉన్న డీలర్ దగ్గరే కొనండి. అలాగే పంట అయిపోయేదాక ఆ ప్యాకెట్‌ను పడేయకుండా జాగ్రత్త పరచాలి. అలాగే ఎరువులు బ్రాండ్ కోరుతున్నారు. అలా ఏమీ ఉండదు ఎరువులు పోషకాలు ఉన్నాయా లేదా అని గుర్తించి కొనుగోలు చేయండి. బ్రాండ్ పేరుతో వేలకు వేలు పెట్టాల్సిన పని లేదు.

గతంలో రైతులకు కావేరి జాదు విత్తనాల నష్టపరిహారం ఏమైంది?

జెడి : కావేరి విత్తనాల రైతులకు నష్టపరిహారం కేసు వాయిదా పడింది. ఆ కేసు ఇంకా కొనసాగుతోంది .రైతులకు న్యాయం చేయాలనే పోరాడుతున్నాం. అలాంటి కంపెనీలు లేకుండా ఇంకా తనిఖీలు కొనసాగుతున్నాయి. ఎక్కడ కూడా రైతులు లూజ్ విత్తనాలను కొనుగోలు చేయకండి.

వర్షపాతం ఎలా ఉంటుంది.ఖరీఫ్ సాగు రైతుల ఆశలు నెరవేరుస్తుందా?

జెడి : ఈ ఏడాది ఖరీఫ్ సాగు చాలా ఆశాజనకంగా ఉంది. నైరుతి రుతుపవనాలు కూడా జూన్ మొదటి వారమే రావడం ఇప్పటికే జిల్లా వ్యాప్తంగా పుష్కలంగా వర్షాలు పడుతున్నాయి. జూన్ మాసంలో సాధారణ వర్షపాతం కంటే 67 శాతం అధికంగా నమోదు అయింది. ఈ ఏడాది వర్షాలు అధికంగా ఉంటుందని ఇప్పటికే వాతావరణ అధికారులు తెలిపారు. రైతులకు ఖరీఫ్ మంచి దిగుబడులు ఇవ్వాలని అందరూ ఆశించిన పంటలు పొందాలని కోరుతున్నాము.

రైతులకు మీరు ఇచ్చే సలహాలు సూచనలు.?

జెడి : రైతులు జాగ్రత్తగా అప్రమత్తంగా ఉండాలి. ప్రతి విషయంపై వ్యవసాయ అధికారులతో సలహాలు సూచనలు తీసుకోవాలి. సొంతంగా ఎలాంటి మందులు, విత్తనాలు వినియోగించకండి. వ్యవసాయ అధికారులు రైతులకు అందుబాటులో ఉండేలా ఆదేశించాము. ఎలాంటి సమస్యలకైనా సంప్రదించవచ్చు. ఏదైనా కల్తీ, లేదా అధిక ధరలకు విక్రయం జరిగితే వెంటనే అధికారులకు సమాచారం అందించవచ్చు.



చినుకు పడితే చిత్తడే...

- అధ్వాన్నంగా మారిన రహదారులు- వాహనదారులకు తీవ్ర ఇబ్బందులు

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి/విలేకరులు

గ్రామీణ రోడ్ల నుంచి ప్రధాన రహదారుల వరకూ అది ఏ రోడ్లయినా గుంతలు, గతుకులు కనిపించడం సాధారణం అయిపోయింది. వర్షాకాలం చిన్నపాటి వర్షానికి గుంతలు, బురదమయంగా మారుతున్న రహదారులు ఎండాకాలంలో కంకర తేలి గుంతలు, గతుకులతో దర్శనమిస్తున్నాయి. అధ్వాన్నంగా మారి వాహనదారులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన బీసీ జనార్ధన్ రెడ్డికే రోడ్లు, భవనాల శాఖ కేటాయించడంతో జిల్లాలో రోడ్ల పరిస్థితి మారుతుందేమే అని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు...



అధ్వానంగా ఉన్న సి.బెళగల్ మండలం చింతమానుపల్లె రోడ్డు

కర్నూలు, నంద్యాల రెండు జిల్లాలు కలిపి 3,621.408 కిలోమీటర్ల మేర రోడ్లు ఉన్నాయి. వాటిలో 3,248 కిలో మీటర్ల బిటి రోడ్లు, 258.13 కిలోమీటర్ల సిసి రోడ్లు, 7.7 కిలోమీటర్ల మెటల్ రోడ్లు, 107.05 కిలో మీటర్ల అన్ మెటల్ రోడ్లు ఉన్నాయి. ఈ ఏడాది అధిక వర్షాల వల్ల సగానికి పైగా రోడ్లన్నీ రాళు తేలడం, బురదమయంగా మారడంతో ఆయాదారుల గుండా ప్రయాణం చేసేందుకు వాహనదారులు, ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. తరచూ పాడయిన రోడ్లల్లో ప్రయాణించడం వల్ల వాహనదారులు వెన్ను, మెడ సంబంధ రోగాల భారిన పడుతున్నారు. కర్నూలు నగరంలోని రహదారులకూ అదే దుస్థితి దాపురించింది. ఉమ్మడి కర్నూలు జిల్లాకు చెందిన బీసీ జనార్ధన్ రెడ్డికే రోడ్లు, భవనాల శాఖ కేటాయించడంతో జిల్లాలో రోడ్ల పరిస్థితి మారుతుందేమే అని జిల్లా వాసులు ఎదురు చూస్తున్నారు. **గోనెగండ్ల** మండలంలో గోనెగండ్ల నుంచి పెద్దమరివీడుకు వెళ్లే రహదారి గుంతలమయంగా మారి ప్రజలు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. దశాబ్దాల క్రితం వేసిన ఈ రహదారికి 2009లో ఫ్లడ్ డ్యామేజ్ రిపేర్స్ (ఎఫ్‌డిఎస్) కింద కొద్దిపాటి పనులు చేయడం తప్ప ఇంతవరకు ఎలాంటి మరమ్మతులూ చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు. పెద్దమరివీడు గ్రామ జనాభా సుమారు 5 వేలు. తహశీల్దార్ కార్యాలయం ఎంపిడిఓ కార్యాలయం, పోలీసు స్టేషన్‌తో పాటు వ్యక్తిగత కారణాలు, అవసరాలతో రోజూ వందలాది మంది గోనెగండ్ల ఈ రహదారి గుండా రాకపోకలు సాగిస్తూ ఉంటారు. రహదారి గుంతలు పడి కంకర తేలడంతో ద్విచక్ర వాహనాలు ఆటోల్లో ప్రయాణించడానికి, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. **దేవనకొండ** మండలంలోని పుల్లాపురం నుండి తెర్నేకల్ గ్రామానికి వెళ్లే రహదారి అద్వాన స్థితికి చేరుకొని కంకర తేల డంతో ఆయా గ్రామస్తులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత అనేక ఏళ్ల క్రితం నిర్మించిన మట్టి రోడ్డు ఇప్పటివరకు ఎలాంటి మరమ్మత్తులు చేయలేదని గ్రామస్తులు వాపోతున్నారు.పుల్లాపురం నుండి తెర్నేకల్ గ్రామం వరకు 3 కిలోమీటర్ల రహదారి గుంతలు పడి కంకర తేలడంతో ద్విచక్ర వాహనాలు, ఆటోల రాకపోకలకు పలు ఇబ్బందులు పడుతున్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అదేవిధంగా రహదారి మధ్యలో కల్వర్టు శిథిలావస్థకు చేరుకుంది. దీంతో ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందో అన్న భయాందోళనలో ఉన్నామని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఆ గ్రామస్తులు పండించిన పంట ఉత్పత్తులను ఎమ్మిగనూరు, ఆదోని మార్కెట్లకు తరలిస్తుంటారు. రహదారి కల్వర్టు అధ్వాన స్థితికి చేరుకోవడంతో పంట ఉత్పత్తులను కూడా తరలించలేని పరిస్థితి నెలకొందని గ్రామస్తులు వాపోతున్నారు. బాలింతలు, గర్భవతులు వైద్యం చేయించుకోవడానికి వెళ్లాలంటే నరకం చవిచూస్తున్నామని వాపోయారు. **పెద్దకడబూరు** మండలంలో నిత్యం రద్దీగా ఉండే ఎమ్మిగనూరు – కోసిగి రహదారిలో ప్రయాణమంటే నరకంగా మారింది. మండల పరిధిలోని కమ్మలదిన్నె నుండి ఎమ్మిగనూరు వరకు రహదారి మొత్తం కంకరతేలి అడుగడుగునా గుంతల మయంగా మారింది. రహదారిలో ఎమ్మిగనూరు నుండి కోసిగి, ఉరుకుంద ప్రాంతాలకు నిత్యం ఆటోలు, మోటారు సైకిల్, బస్సుల ద్వారా ప్రయాణికులు ప్రయాణాలు కొనసాగిస్తున్నారు. అడుగడుగునా గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఏమాత్రం ఆదమరచిన ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. కనీసం గుంతలు పూడ్చలేని పరిస్థితిలో ఆర్అండ్‌బి అధికారులు ఉన్నారని ప్రయాణికులు ఆరోపిస్తున్నారు. కమ్మలదిన్నెలో ప్రధాన రోడ్డులోనే మోకాలు లోతు గుంతలు ఏర్పడ్డాయి. గతంలో కమ్మలదిన్నె నుండి ఎమ్మిగనూరు వరకు డబుల్ రోడ్డుకు నిధులు మంజూరైనా నేటికీ పనులు ప్రారంభం కాలేదు. కమ్మలదిన్నెలో వాగుపై నిర్మించిన వంతెనకు కన్నాలు పడి ప్రమాదపు అంచున ఉంది. వర్షం వస్తే మరింత దారుణంగా తయారవుతుందని గ్రామస్తులు వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రహదారిలో గుంతలు పూడ్చి రోడ్డు నిర్మించాలని కోరుతున్నారు. **సి బెళగల్** మండల కేంద్రంలో రోడ్డు ఆనవాలు కానరావడం లేదు. ఏళ్లుగా వర్షాకాలం వస్తే చాలు బురద బురదగా మారుతున్నాయి. అరడానికి రెండు లేదా మూడు రోజులు పడుతోంది. దీంతో ప్రయాణికులకు అవస్థలు తప్పడం లేదు. చింతమాను పల్లె రోడ్డు మరీ ఆధ్వానంగా మారింది. వర్షానికి గుంతల్లో ఏ స్థాయిలో నిలిచి ఉన్నాయో తెలియక ప్రజలు, వాహనదారులు పడి లేచి వెళ్తున్నారు.

వేళకు గమ్యం చేరలేక పోతున్నాము



అవసరాలు తీరాలన్నా, పట్టణాలకు వెళ్లి రావాలన్న బెళగల్‌కు తప్పనిసరిగా చేరుకోవాలి. ప్రయాణం చేయాలంటే నరకంగా మారింది. రోడ్డు బాగాలేదు. అధికారులకు పట్టడం లేదు. అధిక సమయం అవుతోంది. వేళకు గమ్యం చేరలేక పోతున్నాము.

- హుసేన్ బీబీ, గొల్లల దొడ్డి, సి.బెళగల్ మండలం.

పట్టించుకొనే నాధులు కరవయ్యారు



బెళగల్ నుండి మా ఊరికి వెళ్లాలంటే చింతమాను పల్లి మీదుగా వెళ్ళాలి. సుమారు 9 కిలోమీటర్లు మేర బీటి రోడ్డు ఆనవాళ్లు లేవు. టు, త్రి, ఫోర్ వీలర్లు, ఇతర భారీ వాహనాలు పాట్లు పడితేనే గమ్యం చేరుకొంటాం. గత్యంతరం లేక వేరే దారి లేక అవస్థలుపడుతున్నారు. పలు చోట్ల కల్వర్టులకు రంధ్రాలు పడినా పట్టించుకొనే నాధులు కరవయ్యారు.

- వేణుగోపాల్ రావు, తిమ్మందొడ్డి, సి.బెళగల్ మండలం.

నగర ముస్లింలకు బక్రీద్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

పవిత్ర బక్రీద్ పండుగ (ఈద్–ఉల్–ఆదా) సందర్భంగా నగర ప్రజలకు మేయర్ బివై. రామయ్య, కమిషనర్ ఎ.భార్గవ్ తేజ శుభాకాంక్షలు తెలిపారు. త్యాగనిరతికి, అల్లాపై విశ్వాసానికి ప్రతీకగా ముస్లింలు ఈ పండుగ జరుపుకుంటారని వారు తెలిపారు.



'బాల్యమే శరణార్థి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కెంగారమోహన్, పాణి, తదితరులు

వైవిధ్యమైన కవిత్వశిల్పం 'బాల్యమే శరణార్థి'

-సాహితీ స్రవంతి రాష్ట్రఅధ్యక్షులు కెంగార మోహన్

ప్రజాశక్తి-కర్నూలు కల్చరల్

వైవిధ్యమైన కవిత్వశిల్పం బాల్యమే శరణార్థి కవిత్వమని ప్రాపంచిక దృక్పథంతో కవిత్వం రాశారని సాహితీ స్రవంతి రాష్ట్ర అధ్యక్షులు కెంగార మోహన్ అన్నారు. ఉద్యోగ క్రాంతి ప్రచురణల ఆధ్వర్యంలో కవి కె.రత్నం యేసేపు రాసిన కవిత్వం బాల్యమే శరణార్థి ఆవిష్కరణ సభ నగరంలోని లలిత కళాసమితిలో జరిగింది. సభాధ్యక్షులుగా కెఎన్‌పిఎస్ జిల్లా అధ్యక్షులు సుబ్బారాయుడు అధ్యక్షత వహించారు. ఆవిష్కర్త మాట్లాడుతూ ప్రపంచంలో ఏం జరుగుతుందో అన్న విషయాన్ని చాలా స్పష్టంగా..సమాజం పట్ల ఎంతో బాధ్యతగా ఈకవిత్వం రాశారన్నారు. ఒక్కో విషయాన్ని చెబుతూ కవిత్వీకరిస్తూ వచ్చాడన్నారు. మనిషిని, సమాజాన్ని చదవలేని జ్ఞానం విజ్ఞానం కాదు అజ్ఞానమని మనిషిలోని మనస్సుని, మానవీయతను వెలికి తీయని పాఠం శాస్త్రీయం కాదని చెప్పాడన్నారు. సామాజిక స్పృహ లేని టీచర్లు ఈ సమాజంలో ఉన్నారని చెబుతూనే పిల్లలు ఈ సమాజంలో బతకగలిగే పాఠాలు నేర్పేవాళ్ళు కావాలంటాడన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1వతరగతి నుండి తెలుగు భాషామాధ్యమాన్ని రద్దుచేసిన సందర్భంగా రాసిన కవితలో ..'తల్లి భాష కావాలని చిన్నారి శంభూకులు నినదిస్తే ..తలనరకడానికి రాముడు అవసరంలేదు'...నేటి ఏలికలు చాలు తల్లీ అంటూ అమ్మభాష కవితలో చెప్తాడని, ఇలాంటి గొప్ప కవిత్వం ఈ సంపుటిలో ఉందన్నారు. విరసం రాష్ట్ర నాయకులు పాణి మాట్లాడుతూ విద్యారంగంలో మనదేశంలో ఎలా ప్రమాదంలో ఉందో కవి తన కవిత్వంలో ఆవేదనగా చెప్తాడన్నారు. అలా రాయడానికి విద్య అన్నది మనదేశంలో సార్వత్రికం కాకకపోవడం విద్య ప్రపంచ విధానాలకు అనుగుణంగా లేకపోవడం విషాదమన్నారు. అసలు మన దేశానికి నిర్ధిష్టమైన శాస్త్రీయమైన విద్యావిధానం లేకపోవడం మరింత విచారకరమన్నారు. ఇంకా ఈ కవిత్వ సంపుటిలో ఢిల్లీ సరిహద్దుల్లో జరిగిన చారిత్రక రైతు ఉద్యమం మీద..ప్రస్తుతం జరగుతున్న పాలస్తీనా – ఇజ్రాయిల్ యుద్ధం మీద బలమైన కవితలున్నాయని, ప్రపంచంవ్యాప్త పరిణామాల్ని ఈ కవి చరిత్రలో రికార్డు చేసే పనిలో ఈ కవిత్వం ద్వారా కవి రత్నంయేసేపు సఫలీకతుడయ్యాడని పించిందన్నారు. వర్తమాన సాహిత్య సమాజానికి అవసరమైన కవిత్వం 'బాల్యం శరణార్థి' అన్నారు. కవి రత్నం యేసేపు తన స్పందన తెలిపారు. సమావేశంలో విరసం నాయకులు నాగేశ్వరాచారి, సాహితీ స్రవంతి రాష్ట్ర కార్యదర్శి జంధ్యాల రఘుబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల చక్రపాణి యాదవ్, ఆద్య మెడికల్ అధినేత ఎవి రెడ్డి, యుటిఎఫ్ జిల్లా నాయకులు రాములు, రాయలసీమ మేధావుల సంఘం నాయకులు రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

పిడుగు పాటుకు ఇద్దరు గొర్రెల కాపరులు మృతి

మరోఇద్దరికి అస్వస్థత

ప్రజాశక్తి -తుగ్గలి

కర్నూలు జిల్లా తుగ్గలి మండలం పరిధిలోనే రామలింగయ్య పల్లి గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు ఎరుకల సుంకన్న (46), ఎరుకల కామేశ్వరి(35) పై ఆదివారం రాత్రి పిడుగు పడడంతో అక్కడికక్కడే మతి చెందారు. రామలింగయ్య పల్లె గ్రామానికి చెందిన గొర్రెల కాపరులు ఎరుకల సుంకన్న, ఎరుకల కామేశ్వరి మరో ఇద్దరూ చెన్నంపల్లి కొండలలో గొర్రెలు ఆపుకొని ఉన్నారు. భారీ గాలీ, ఉరుములు మెరుపుల వాన వచ్చింది. కాపరులపై పిడుగు పడడంతో వారిద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. అక్కడే ఉన్నకామేశ్వరి భర్త ఎరుకల సుంకన్నకు మరో ఇద్దరు కూడా గాయాలకు గురయ్యారు. గొర్రెల కాపరులు ఇద్దరు పిడుగు పడి మృతి చెందడంతో ఎస్‌టి కాలనీ ప్రజలు దుఃఖసాగరంలో మునిగిపోయారు.

బక్రీద్‌కు పటిష్ట భద్రత

- -ముస్లింలకు, పోలీసు సిబ్బందికి ఎస్‌పి బక్రీద్ శుభాకాంక్షలు
- -హిందూ, ముస్లింలు కలిసి మెలసి పండుగలు జరుపుకోవాలి
- -ప్రజలు పోలీసులకు సహకరించాలి
- -చెక్ పోస్టులలో అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి కృష్ణకాంత్

ప్రజాశక్తి- కర్నూలు క్రైమ్



వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న కర్నూలు ఎస్‌పి జి.కృష్ణకాంత్

బక్రీద్ పండుగ అందరి జీవితాల్లో ఆనందోత్సాహాలు నింపాలని, అల్లాహ్ అందరిని ఆశీర్వదించాలని కర్నూలు జిల్లా ఎస్‌పి జి.కృష్ణకాంత్ ముస్లింలకు , పోలీసు సిబ్బందికి బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ఆదివారం కర్నూలై ఒకటవ పట్టణ పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం కర్నూలు పట్టణ శివారులలోని జోహరాపురం, పూల బజారు, గుత్తి పెట్రోల్ బంకు , సంతోష్ నగర్ హైవే దగ్గర ఉన్న కొత్త ఈద్గా, పంచలింగాల చెక్ పోస్టుల వద్ద ఎస్‌పి భద్రత ఏర్పాట్లను పర్యవేక్షించారు. బక్రీద్ పండుగ సంధర్భంగా ట్రాఫిక్ మళ్లింపు, పోలీసు బందోబస్తు ఏర్పాట్ల గురించి పోలీసు అధికారులకు పలు సూచనలు , సలహాలు తెలిపారు. కర్నూలు జిల్లా మత సామరస్యానికి ప్రతీక అని, ఈనెల 17న సోమవారం బక్రీద్ పండుగను అందరూ సంతోషంగా జరుపుకోవాలన్నారు. జిల్లాలో ఎక్కడ ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని భద్రతా ఏర్పాట్లు చేపట్టామని అన్నారు. ఏదైనా సమస్యలు ఉంటే వెంటనే జిల్లా అధికారుల దృష్టికి తీసుకురావాలన్నారు. శాంతియుత వాతావరణానికి భంగం కలిగించే వారిపై నిఘా ఉంచామన్నారు. పోలీసు చెక్ పోస్ట్‌లను ఏర్పాటు చేశామన్నారు. బక్రీద్ పండుగను శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలన్నారు. కర్నూలు పట్టణంలో పోలీస్ పికెట్లు ,మొబైల్ పార్టీలను బృందాలుగా ఏర్పాటు చేసి నిఘా పెట్టామన్నారు. పుకార్లు, వదంతులను నమ్మకూడదని , సమస్యలుంటే డయల్ 100కు, స్థానిక పోలీసులకు ప్రజలు తెలియజేయాలన్నారు. ఎస్‌పి వెంట కర్నూలు డిఎస్‌పి విజయ శేఖర్ , సిఐలు నాగరాజ్ యాదవ్ ,ప్రసాద్ ,పవన్ కుమార్,శంకరయ్య, ట్రాఫిక్ సిఐ గౌతమి, ఎస్ఐ ఖాజావలి ఉన్నారు.

బక్రీద్ సందర్భంగా ట్రాఫిక్ మళ్లింపు

ఈనెల17న బక్రీద్ సందర్భంగా కర్నూలు పట్టణంలో ముస్లిం సహోదరులకు ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు కలగకుండా ట్రాఫిక్ మళ్లింపును రేపు ఉదయం 6 గంటల నుండి మసీదులలో ప్రార్ధనలు ముగిసే వరకు కొనసాగిస్తామని కర్నూలు జిల్లా కర్నూల్ ట్రాఫిక్ సిఐ పి.గౌతమి తెలిపారు. హైదరాబాద్ రూట్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను కర్నూల్ టౌన్ లోనికి రానివ్వకుండా తిప్పమ్మ కొట్టం నుండి నేషనల్ హైవే పైన మళ్లించామన్నారు. ఆర్టీసీ బస్టాండ్ ఔట్ గేట్ నుండి ఆర్‌టిసి బస్సులను బళ్లారి చౌరస్తా మీదుగా గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా బిర్లా జంక్షన్ సికాంప్ సర్కిల్ నుండి నంద్యాల చెక్ పోస్ట్ మీదుగా మళ్లింపు చేశామని,నంద్యాల చెక్పోస్ట్ నుంచి వచ్చే ఆర్టీసీ బస్సులను మద్దూర్ నగర్ నుండి డైవర్షన్ చేసి బిర్లా జంక్షన్ గుత్తి పెట్రోల్ బంక్ మీదుగా ఆర్టీసీ బస్టాండ్‌కు చేరుకోవాలన్నారు. పై విషయమును కర్నూలు పట్టణ ప్రజలు గమనించి పోలీసు వారికి సహకరించాలని కోరారు.

బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మంత్రి, కలెక్టర్

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

బక్రీద్ పండుగ సందర్భంగా జిల్లాలోని ముస్లింలకు ,వారి కుటుంబ సభ్యులకు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం,ఆహార పరిశుద్ధి శాఖా మంత్రి టిజి. భరత్, కర్నూలు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింల ఆరాధ్య గ్రంథం దివ్య ఖురాన్ ప్రకారం సమాజంలో పేరుకుపోతున్న రుగ్మతల నుంచి మానవాళిని జాగృతపరుస్తూ సన్మార్గంలో నడిపించేందుకు అల్లాహ్ పంపిన ప్రవక్తల్లో ఒకరైన హజరత్ ఇబ్రహీం త్యాగనిరతికి ప్రతీకగా జరుపుకొనే పండగ బక్రీద్‌అని, ఎంతో పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగ దాన గుణానికి, త్యాగానికి ప్రతీక అని తెలిపారు. కుటుంబ సభ్యులతో సంతోషంగా పండుగ జరుపుకోవాలని వారు ఆకాంక్షించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కె. బాబురావు జిల్లాలోని ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు.

త్యాగానికి ప్రతీక బక్రీద్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ఇస్లాం మతాన్ని అనుసరించి ముస్లింలు ప్రముఖంగా చేసుకునే పండుగలు బక్రీద్ ఈద్ అల్ అదహాకు ప్రత్యేక స్థానం ఉంది. అల్లాహ్ ఆదేశం ప్రకారం ఇబ్రహీం ప్రవక్త తన కుమారుడైన ఇస్మాయిల్ ను బలి ఇవ్వడానికి తీసుకువెళ్లే సంప్రదాయాన్ని స్మరిస్తూ చేసుకునే పండుగ బక్రీద్. బక్రీద్ అంటే జంతువు ఈద్ అనగా పండుగ. హజరత్ ఇస్మాయిల్ కలలో అల్లాహ్ తన కుమారుని బలి ఇవ్వమని కోరుతాడట. ఉదయం తన కుమారుడైన ఇస్మాయిల్‌తో రాత్రి తన కలలో అల్లా చెప్పిన విషయాన్ని తన భార్య కుమారులకు తెలుపగా అందుకు ఇస్మాయిల్ సుమ్మతించి బలి కావడానికి సిద్ధపడతాడు. బలి ఇచ్చే సమయంలో తండ్రి తన కుమారుని బలి ఇవ్వడానికి సిద్ధపడగా నాన్న నీవు నా గొంతు కోయటానికి వెనకాడవచ్చు కావున నీ కళ్ళకు గంతలు కట్టుకోమంటాడట. ఆ సమయంలో ఇస్మాయిల్ స్థానంలో బకరా పొట్టేలును ఉంచి జబహ చేయబడుతుంది. నాటినుండి బక్రీద్ పండుగను త్యాగానికి ప్రత్యేకగా ముస్లింలు జరుపుకుంటారు. ఈ పండుగ సందర్భంగా ఆ మాంసాన్ని మూడు భాగాలు చేసి ఒక భాగం ఇంటిలో ఉంచుకొని, రెండో భాగం బంధువులకు, మూడో భాగం పేదలకు పంచి పెడతారు. ఇలా అందరూ ఉదయం బక్రీద్ పండగ రోజు నమాజు అనంతరం జంతువులను బలి ఇచ్చి ఆ మాంసాన్ని అందరికీ పంచిపెట్టే సాంప్రదాయం కొనసాగుతోంది.



కర్నూలు నగరంలోబక్రీద్ పండుగ నమాజ్ వేళలు: మజీద్ హజరత్ లతీఫ్ లవ్‌బలి, కద్దు మియా మస్జిద్‌లో ఉదయం 6:10 గంటలకు, ఇంపీరియల్ గార్డెన్ లో 6:15 గంటలకు, పిలి మస్జిద్, క్షత్రిబాగ్, మస్జిద్ మహబూబాషా, నూరాణి మస్జిద్‌లలో ఉదయం 6:30 నిమిషాలకు, మస్జిద్ ధర్వేశ్ ఖాద్రి, సలాం నగర్ మస్జిద్, మస్జిద్ ఏ కాలిక్ లింగ, మస్జిదే సయ్యద్ అభివృద్ధి రైల్వే స్టేషన్‌లలో ఉదయం ఏడు గంటలకు, గౌండ మజీద్ ఉదయం 7:15 నిమిషాకు, మౌలామిస్కిన్, పోలీస్ లైన్‌లలో ఉదయం 7: 30 నిమిషాలకు, షామియా మసీద్, దర్బీ మసీదు, ఎద్రిస్ మస్జిద్, హాజీ సాహెబ్ మస్జిద్, మస్జిదే అల్మాస్, నైపేట (కొత్తపేట), మస్జిద్ హుబ్‌సూరత్ బడే సాహెబ్, మస్జిద్ సుల్తానియా , మోమిన్ మస్జిద్ జోహారాపురం, మెటికి మసీద్, మజీద్ ఏ నాల్ బంద్‌లలో 8:30 కు, జామియా మసీదు, ఇసాకియా మస్జిద్ లలో 9 గంటలకు, రోజా దర్గా మసీదులో ఉదయం 10 గంటలకు బక్రీద్ నమాజ్ చదువుతారని తెలిపారు.

మంత్రి టిజి.భరత్‌కు కలెక్టర్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్



మంత్రి టిజి.భరత్‌కు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలుపుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్యం, ఫుడ్ ప్రాసెసింగ్ శాఖ మంత్రి టిజి భరత్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదివారం శుభాకాంక్షలు తెలిపారు. సంకల్ బాగ్ లోని మంత్రి నివాసంలో జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా మంత్రిని కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం ఇరువురు జిల్లా అభివృద్ధి విషయాలపై చర్చించారు. అనంతరం డిఆర్ఓ మధుసూదన్ రావ్, సిఎఫ్ఓ పి. రామకృష్ణ, రిటైర్డ్ డిఎస్‌పి మహబూబ్ బాషా, టిడిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు మల్లెల రాజశేఖర్, రాగమయూరి బిల్డర్స్ అధినేత కెజె రెడ్డి, మాంటిస్సోరి విద్యాసంస్థల అధినేత రాజశేఖర్, టిడిపి నాయకులు బొల్లెద్దుల రామక్రిష్ణ, పలువురు నాయకులు, కార్యకర్తలు, స్థానికులు మంత్రికి శుభాకాంక్షలు తెలిపారు.



మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ ముగింపులో విద్యార్థులతో డాక్టర్ శంకర శర్మ

వ్యాయామంతో చక్కటి ఆరోగ్యం

మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ ముగింపులో డాక్టర్ శంకర శర్మ

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

శారీరక వ్యాయామంతో పాటు ప్రతిరోజు పండ్లను తినడం వల్ల ప్రతి ఒక్కరూ ఆరోగ్యంగా జీవించవచ్చని సీనియర్ గ్యాస్ట్రోఎంటరాలజిస్ట్ డాక్టర్ శంకర్ శర్మ సూచించారు. వరల్డ్ ఫాదర్స్ డే సందర్భంగా నగరంలోని లక్ష్మీ నరసింహ స్వామి కళ్యాణ మండపంలో జరిగిన మార్షల్ ఆర్ట్స్ వేసవి శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. డాక్టర్ శంకర శర్మ మాట్లాడుతూ క్రీడల్లో పాల్గొనడం వల్ల శారీరక మానసిక ఆరోగ్యం మెరుగుపడి జీవనశైలికి సంబంధించిన వ్యాధులకు గురి కాకుండా జీవించవచ్చని చెప్పారు. ఇటీవల కాలంలో ఊబకాయం, బిపి, షుగర్, క్యాన్సర్ వంటి వ్యాధులు అధికం అవుతున్నాయని, వాటికి దూరంగా ఉండాలంటే శరీరానికి వ్యాయామం కల్పించే క్రీడల్లో సాధన చేయాలని చెప్పారు. దేశ భవిష్యత్తును నిర్దేశించే చిన్నారులను క్రమశిక్షణ పౌరులుగా తీర్చి దిద్దేందుకు క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని వివరించారు. సముద్రం, నదులు ,తీరాలు వంటి ప్రకృతి వనరులతో పాటు దేశ భవిష్యత్తును నిర్దేశించే చిన్నారులను కూడా జాగ్రత్తగా కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు. పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరు పాటుపడాలన్నారు. చిన్నారులు పండ్లను తినడం వల్ల వాటిలో ఉండే విటమిన్ ఎసితో పాటు కాల్షియం, పొటాషియం, మెగ్నీషియం వంటివి ఆరోగ్యాన్ని పెంపొందిస్తాయని చెప్పారు. వేసవి సెలవులను దుర్వినియోగం చేయకుండా క్రీడలలో సాధన చేయడం అభినందనీయ మన్నారు.క్రీడలను అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని చెప్పారు. కరాటే శిక్షకుడు వెంకటేష్ పాల్గొన్నారు.

గాజులదిన్నె ప్రాజెక్టును పరిశీలించిన ఎమ్మెల్యే బివి

- రెండు రోజుల్లో ఒక గేట్ అయినా సిద్ధం చేయాలని ఆదేశం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గాజులదిన్నె ప్రాజెక్టును ఆదివారం ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బివి జయ నాగేశ్వరరెడ్డి పరిశీలించారు. ఎమ్మెల్యేగా గెలుపొంది మొదటిసారి గోనెగండ్లకు విచ్చేసిన ఎమ్మెల్యేకు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పూలమాలలు శాలువాలతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన ప్రాజెక్టు వద్దకు చేరుకొని అధికారులతో కలిసి ఆనకట్ట పనులు, గేట్ల ఆధునికీకరణ, ప్రాజెక్టులో నీటి నిలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాలం ప్రారంభమైనా గేట్ల ఆధునికీకరణ పూర్తి చేయకుండా ఒక గేటుకు కూడా గేట్ రోప్‌లను ఏర్పాటు చేయకపోవడంపై ఆయన ఆశ్చర్యం వ్యక్తం చేశారు.ప్రాజెక్టు క్యాచ్ మెంట్ ఏరియాలో అకస్మాత్తుగా వర్షాలు కురిసి రెండు మూడు రోజుల్లో డ్యామ్ పూర్తిస్థాయిలో నిండి నీటిని విడుదల చేయాల్సి వస్తే పరిస్థితి ఏమిటని ఆయన అధికారులను ప్రశ్నించారు. ప్రాజెక్టులోకి 500 నుంచి1000 క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో వచ్చినా కిందికి వదిలే విధంగా రెండు రోజుల్లో కనీసం ఒక్క గేటునైనా సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. ఏదైనా ప్రమాదం సంభవిస్తే ప్రాజెక్టు అధికారులు సంబంధిత సిబ్బందిదే బాధ్యత అన్నారు. గత ప్రభుత్వము కమీషన్ల కోసం పనులకు సంబంధించిన ఎస్టిమేట్లను వందల కోట్ల రూపాయలు పెంచుకొని ముంపుకు గురవుతున్న పొలాల రైతులకు న్యాయమైన పరిహారాన్ని ఇవ్వమంటే ఇవ్వలేదని అన్నారు. ఆనకట్ట పనుల్లో జరిగిన అవకతవకలపైన


గాజులదిన్నె గేట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయ నాగేశ్వర రెడ్డి

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, జల వనరుల శాఖ మంత్రి దృష్టికి తీసుకుని వెళ్లి ఎంక్వయిరీ వేయించి బాధ్యులైన గుత్తేదారుడు అధికారులపై తగిన చర్యలు తీసుకునేలా చూస్తామని అన్నారు. ఈఈ శైలేశ్వర్, డిఈ విజయకుమార్, ఏఇలు చిన్న అలీ, పరమేష్, టిడిపి నాయకులు నజీర్ సాహెబ్, బేతాళ బడేసాహెబ్, రామాంజనేయులు, తిరుపతయ్య నాయుడు, రహమతుల్లా, షేక్షావలి, గాజులదిన్నె హనుమంతు, పిల్లిగుండ్ల కృష్ణ, జయపాల్, రంగస్వామి నాయుడు, ముల్ల భాష, పూజారి చంద్రశేఖర్, అడ్వకేట్ వెంకటేష్, చిన్ననెలటూరు నాగన్న, సంజీవయ్య ఆచారి పాల్గొన్నారు.

వ్యాపార రంగాన్ని విస్తరించుకోవాలి

-సినిమా హీరో సుమన్ సందడి

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని పట్టణంలోని అంబేద్కర్ నగర్ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల రోడ్డులో ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బట్టల దుకాణంను ఆదివారం సినిమా హీరో సుమన్ ప్రారంభించారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి దుకాణంలోనే దుస్తులను పరిశీలించారు. హీరోతో పాటు ఆదోని ఎమ్మెల్యే డాక్టర్ పార్థసారథి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు దుకాణాన్ని సందర్శించి అందులో లభిస్తున్న క్వాలిటీస్‌ని అడిగి తెలుసుకున్నారు. సినిమా హీరో సుమన్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో బట్టల దుకాణాలు ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. యువత వ్యాపార రంగంలో రాణిస్తూ పలువురు ఉపాధి అవకాశాలు కల్పించాలన్నారు. సినీ నటులు రాజకీయాలలో రాణించలేరని కొందరి అభిప్రాయాలను తాను విభేదిస్తున్నానన్నారు. పార్టీలు స్థాపించి ఎందరో సినిమా నటులు రాజకీయంగా రాణించి క్రియాశీలకంగా వ్యవహరించారని గుర్తు చేశారు. ఏపీ రాజకీయాలలో సినిమా హీరో పవన్ కళ్యాణ్ ఆ కోవలో ఉన్నారని కొనియాడారు. ఆదోని ఎమ్మెల్యే పార్థసారథి మాట్లాడుతూ డివిజన్ కేంద్రమైన ఆదోనిలో వ్యాపారాలు విస్తరించాలన్నారు. అందుకు కావలసిన సహాయ సహకారాలు అందిస్తామన్నారు. టిడిపి రాష్ట్ర కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ వ్యాపార


వస్త్రదుకాణం ప్రారంభించి మాట్లాడుతున్న ప్రముఖ సినీ హీరో సుమన్

పరంగా విస్తరించినప్పుడే ఉపాధి కల్పన జరుగుతుందన్నారు. జనసేన ఇన్చార్జి మల్లప్ప మాట్లాడుతూ ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ వారు స్థాపించే బట్టల దుకాణాలలో స్థానికులకే ఉద్యోగాలు కల్పించడం మంచి శుభ పరిణామం అన్నారు. కార్యక్రమంలో ఎద్దుల కాటన్ ప్రైవేట్ లిమిటెడ్ చైర్మన్ ఎద్దుల మహేశ్వర్ రెడ్డి, డైరెక్టర్లు ఎద్దుల సూర్య రెడ్డి, ఎద్దుల సత్య రెడ్డి, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్లు దేవేంద్రప్ప, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి గుడిసె ఆది కృష్ణమ్మ, తెలుగు యువత నాయకులు సిద్ధార్థ నాయుడు పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు మెప్మా, సెర్ఫ్‌లో లక్షల అవినీతి

- అవినీతి సొమ్మును రాబడతాం-- ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు మున్సిపాలిటీలోని మెప్మా, సెర్ఫ్ శాఖలలో అవినీతి అక్రమాల జరిగినట్లు తమ దృష్టికి వచ్చిందని, చేసిన తప్పులను ఒప్పుకుంటే సరే లేకపోతే తీవ్ర పరిణామాలు ఉంటాయని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి హెచ్చరించారు. ఆదివారం స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో మున్సిపల్ మెప్మా, సెర్ఫ్ ఉద్యోగులు, సిబ్బంది, ఆర్పీ పొదుపు గ్రూపు సంఘాల మహిళలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ కొంత మంది సిబ్బంది ఆర్పీ లు ,పొదుపు గ్రూపు సంఘాల లీడర్లు తమ సొంత అవసరాలకు నిధులను వాడుకొని అవినీతికి పాల్పడ్డారన్నారు. సొంత డబ్బులు మాదిరిగా నిధులను వాడుకున్నారన్నారు. జగనన్న సొంత ఇంటికి ఎంపికైన లబ్దిదారులకు స్థలం లేకున్నా ఉన్నట్లు తప్పుడు నివేదిక సష్టించి బ్యాంక్ లింకేజి పేరుతో డబ్బులు కట్టించుకొని మోసాలకు పాల్పడ్డారన్నారు. అనాథల ఆశ్రయం లేకున్నప్పటికి ఉన్నట్లు రికార్డులు చూపించి లక్షలు కొట్టేశారన్నారు. అలాగే పొదుపు గ్రూపులకు ఇవ్వవలసిన లక్షలు రూపాయిలు లబ్ధిదారులకు ఇవ్వకుండా సొంతంగా వాడుకున్నారన్నారు. ఇందుకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగిన వారి నుండి సమాధానం రాలేదన్నారు. పొదుపు మహిళను మోసం చేసి సంపాదించుకున్న వారి అవినీతి పై విచారణ జరిపి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి

మహిళా మార్ట్ పేరు చెప్పి 20 లక్షలు నొక్కారన్నారు. ఈ డబ్బులను పొదుపు మహిళకు ఇప్పించామన్నారు. ముఖ్యమంత్రి చంద్ర బాబు నాయుడు ఆశీస్సులతో ఎమ్మిగనూరు మున్సిపాలిటీను అభివృద్ధి చేసి రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలబెడుతామన్నారు.

కెవిపిఎస్ బలోపేతానికి కృషి

కెవిపిఎస్ జనరల్ బాడీ సమావేశాలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

సామాజిక సమస్యలపై అధ్యయనం, సమస్యల పరిష్కారానికై పోరాటంలో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని మండల, పట్టణ కమిటీల పరిధిలో కెవిపిఎస్ విస్తరణకు జనరల్ బాడీ సమావేశాలను నిర్వహిస్తున్నామని, ఆయా సమావేశాలలో కార్యకర్తలందరూ పాల్గొని జయప్రదం చేయాలని కెవిపిఎస్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ దేవసహాయం, ఎండి ఆనందబాబు పిలుపునిచ్చారు. ఆదివారం పట్టణంలోని శివ సర్కిల్ వద్ద ఉన్న కెవిపిఎస్ జిల్లా ఉప కార్యాలయంలో కెవిపిఎస్ నందవరం మండల కార్యదర్శి మామిడికాయల రాజు అధ్యక్షతన ఎమ్మిగనూరు, నందవరం మండలాలు, ఎమ్మిగనూరు పట్టణ నాయకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా దళితులపై జరుగుతున్న దారుణాలపై ఎక్కడికక్కడ స్పందించి పనిచేసే ఉద్యమ సంఘంగా ఉన్న కెవిపిఎస్‌ను మరింత బలోపేతం చేసుకుని ఉద్యమించేందుకు సిద్ధం కావాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలో రాజకీయాలు మారిన నేపథ్యంలో గ్రామాల వారిగా మనం ఎదుర్కొంటున్న సమస్యలపై మరింత అధ్యయనంతో నూతన ప్రభుత్వం ముందు ఉంచాల్సిన బాధ్యత మనందరిపైన ఉందన్నారు. అందులో భాగంగానే జిల్లా వ్యాప్తంగా అన్ని



సమావేశంలో మాట్లాడుతున్న కెవిపిఎస్ జిల్లా అధ్యక్షులు దేవసహాయం

మండల, పట్టణ జనరల్ బాడీ సమావేశాలను నిర్వహిస్తున్నామన్నారు. జూన్ 22న ఎమ్మిగనూరు మండలం, జూన్ 29న నందవరం మండలం, జూలై 06న ఎమ్మిగనూరు పట్టణ జనరల్ బాడీ సమావేశాలను నిర్వహిస్తున్నామని, సమావేశాలకు కార్యకర్తలంతా హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు. సమావేశంలో కెవిపిఎస్ ఎమ్మిగనూరు పట్టణ కార్యదర్శి ఎస్ ఆంతోని, నాయకులు సుమాల రాజు, గుంటెప్ప, నందవరం మండల నాయకులు నాగప్ప, గంగన్న, ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు చిన్నప్ప, నాయకులు తిమ్మన్న, రాజా రమేష్, ఆనంద్, దేవపుత్ర, రంగన్న పాల్గొన్నారు.

దళిత బాంధవుడు చంద్రబాబు : కదిరికోట ఆదెన్న

'వంగలపూడి అనిత'ను హోంమంత్రిగా నియమించడం పట్ల హర్షం

ప్రజాశక్తి -ఎమ్మిగనూరు

టిడిపి అధినేత, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తన మంత్రివర్గంలో దళిత మహిళ వంగలపూడి అనితను హోంశాఖ మంత్రిగా నియమించి మాదిగ సామాజిక వర్గానికి సముచిత స్థానం కల్పించి పెద్దపీట వేశారని టిడిపి నాయకులు కదిరికోట ఆదెన్న హర్షం వ్యక్తం చేశారు. ఆదివారం ఆయన తన స్వగృహంలో మీడియాతో మాట్లాడుతూ నాటినుండి నేటి వరకు తెలుగుదేశం హాయంలోనే దళితుల అభివృద్ధి జరిగిందన్నారు. రాజ్యాంగబద్ధంగా దళితులకు పదవులు కట్టబెట్టడంలో చంద్రబాబు పునాది వేశారని పేర్కొన్నారు. లోక్ సభ స్పీకర్‌గా జిఎంసి బాలయోగిని, ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా దళిత మహిళ ప్రతిభా భారతిని నియమించారన్నారు. భారతదేశ తొలి దళిత రాష్ట్రపతిగా కెఆర్.నారాయణ్ ను ప్రతిపాదించింది చంద్రబాబేనని గుర్తు చేశారు. ఎన్‌టిఆర్ హయంలో తొలి ఆర్థిక మంత్రిగా దళితుడైన మహేంద్ర నాథ్ ను నియమించి ఎన్నో అవకాశాలు కల్పించడానికి బాటలు వేశారన్నారు. దళిత ఐఎఎస్ అధికారి అయిన కాకి మాధవరావును తొలి దళిత ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిగా నియమించిన చంద్రబాబు ఎస్‌సి, ఎస్‌టిలకు ప్రమోషన్లలో రిజర్వేషన్లు కల్పించారని, అంటరానితన నిర్మూలన కోసం 2001 లో జస్టిస్ పున్నయ్య కమిషన్‌ను


మాట్లాడుతున్న కదికోట పెద్దన్న

నియమించి ఆ కమిటీ చేసిన 42 సిఫారసుల అమలు కోసం 18 జీవోలు విడుదల చేసిన చంద్రబాబు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజకీయ చరిత్రలో దళిత బాంధవుడుగా నిలిచిపోయారని తెలిపారు. గతంలో అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారని, భవిష్యత్తులో దళితులను ధనవంతులను చేసేందుకు కృసి చేరస్తారన్నారు. ఈ సమావేశంలో టిడిపి సీనియర్ నాయకులు రోజా ఆర్ట్స్ ఉసేని పాల్గొన్నారు.

విద్యార్థులకు వాల్మీకి మహర్షి ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి-ఆదోని

కర్నూలు జిల్లా వాల్మీకి ఉపాధ్యాయ , ఉద్యోగ సంఘం ఆధ్వర్యంలో ఆదోని పట్టణంలోని శ్రీమంగళ ఆంజనేయ స్వామి దేవాలయ ప్రాంగణంలో గత విద్యా సంవత్సరంలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వాల్మీకి విద్యార్థులను మండలానికి ముగ్గురు చొప్పున ఎంపిక చేసి వారికి ప్రతిభా పురస్కారాలు అందజేశారు. జిల్లా స్థాయిలో వాల్మీకి విద్యార్థులలో మొదటి మూడు స్థానాలలో నిలిచిన విద్యార్థులను సన్మానించి వరుసగా రూ.10000, రూ.6000, రూ.4000 నగదు పురస్కారం, మండల స్థాయిలో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు రూ.2000, రూ.1500, రూ.1000 నగదు పురస్కారంతోపాటు ఎగ్జిక్యూటివ్ ఫైల్, మెమెంటోలను అందజతేశారు. ముఖ్య అతిథులుగా ఆదోని ఎమ్మెల్యే వాల్మీకి పార్థసారథి, ఎమ్మెల్సీ మధుసూదన్, మున్సిపల్ చైర్పర్సన్ శాంతా, డాక్టర్ కేఆర్ స్వామి, ఫుడ్ కమిషన్ మాజీ డైరెక్టర్ గుడిసె ఆది కృష్ణమ్మ, బ్యాంక్ మేనేజర్ వీరన్న, రిటైర్డ్ ఎంఇఒ శివరాములు హాజరయి మాట్లాడారు. కష్టపడి చదివితే ఉన్నత స్థానాల్లో ఉంటారన్నారు. కష్టపడి చదివి జీవితంలో ఎన్నో ఉన్నత స్థానాలను అందుకోవాలన్నారు. ఈ కార్యక్రమానికి బల్లెకల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు సత్యం అధ్యక్షత వహించగా జిల్లా వ్యాప్తంగా ఉన్న వాల్మీకి


విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేస్తున్న ఎమ్మెల్యే పార్థసారథి

ఉపాధ్యాయ,ఉద్యోగులు పాల్గొన్నారు. జిల్లాలోని మొత్తం 24 మండలాల నుండి విద్యార్థులు , వారి తల్లిదండ్రులు ఈ కార్యక్రమానికి భారీ ఎత్తున వచ్చారు. రమేష్ నాయుడు, నరసయ్య, సాయి తదితరులు ఉన్నారు.

ప్రజాశక్తి ఆదోని డివిజన్ ఇన్‌ఛార్జికి మాతృ వియోగం

ప్రజాశక్తి- ఆస్పరి



ప్రజాశక్తి ఆదోని డివిజన్ ఇంచార్జీ చంద్రశేఖర్ తల్లి పార్వతమ్మ (75) అనారోగ్యంతో ఆదివారం మృతి చెందారు. కొన్ని రోజులుగా అనారోగ్యానికి గురి కావడంతో ఇంటి దగ్గరే చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందారు. ఆమె మృతి చెందడంతో కుటుంబం కన్నీటి పర్వతానికి లోనయింది. పార్వతమ్మ మృతి పట్ల ప్రజాశక్తి జనరల్ మేనేజర్ టి.నరసింహ,డెస్క్ ఇంచార్జ్ పానుగంటి చంద్రయ్య, జిల్లా ఇన్‌ఛార్జి ఎం.రాజు, ఎమ్మిగనూరు డివిజన్ ఇంచార్జీ రంగయ్య, విలేకరులు, సిపిఎం నాయకులు హనుమంతు, రామాంజనేయులు, రంగస్వామి, టిడిపి, బిజెపి, వైసిపి నాయకులు కృష్ణ,వెంకటరాముడు, దత్తాత్రేయ రెడ్డి,సూరయ్య, హంపయ్య,విశ్వనాథ్ ప్రకాఢ సానుభూతి తెలిపారు.


సమావేశంలో మాట్లాడుతున్న ఎస్ఐ నరేంద్రకుమార్‌రెడ్డి

ప్రశాంతంగా బక్రీదు నిర్వహించుకోవాలి

ప్రజాశక్తి- కౌతాళం

సోదర భావం కలిగి పండగలు శాంతియుతంగా ప్రశాంత వాతావరణంలో నిర్వహించుకుని మతసామరస్యాన్ని కాపాడుకుందామని కౌతాళం ఎస్ఐ నరేంద్ర కుమార్ రెడ్డి కోరారు. ఆదివారం కౌతాళం పోలీస్ స్టేషన్లో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఎస్ఐ మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలు తప్పక పాటించి బక్రీదు పండుగ నిర్వహించుకోవాలన్నారు. శాంతియుతంగా ప్రార్థన నిర్వహించుకుని ఇతరులకు ఇబ్బంది కలగకుండా కుర్బానీ చేయాలన్నారు. ఏదైనా సమస్య తలెత్తిన సంఘటన జరిగిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. పారిశుధ్య సమస్య తలెత్తకుండా గ్రామపంచాయతీ నుండి సహాయ సహకారాలు అందిస్తామని సర్పంచి పాల్ దినకరన్ తెలిపారు. ముస్లింలు హిందువులు సోదర భావంతో మెలుగుతామని వివిధ పార్టీ నాయకులు పేర్కొన్నారు. అన్ని వర్గ ప్రజలు మతసామ్రాసానికి ప్రతికగా ఎన్నో సంవత్సరాల నుండి గడుపుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు దాట్ల సుబ్బరాజు, టిడిపి నాయకులు వెంకటపతి రాజు, కాశీ విశ్వనాథ్, మంజు, బిజెపి నాయకులు రామకృష్ణ, జనసేన నాయకులు రామంజి, సిపిఎం, సిపిఐ నాయకులు మల్లయ్య, ఈరన్న, ముస్లిం పెద్దలు ఖాదర్, సద్దాం, వలిసాబ్, యాసిన్ వివిధ ప్రజా సంఘ నాయకులు పాల్గొన్నారు.

హమాలీ కార్మికులకు వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేయాలి : సిఐటియు

ప్రజాశక్తి - కర్నూలు అగ్రికల్చర్

కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డు లారీ హమాలీ కార్మికుల విస్తృత సమావేశం యూనియన్ అధ్యక్షులు ఎం.వెంకటేశ్వర్లు అధ్యక్షతన మార్కెట్ యార్డ్‌లో నిర్వహించారు. ఈ సమావేశానికి సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్.రాధాకృష్ణ, కర్నూలు న్యూ సిటీ సిఐటియు అధ్యక్ష, కార్యదర్శులు ఆర్.నరసింహులు, సిహెచ్.సాయి బాబా, మార్కెట్ యార్డ్ యూనియన్ల గౌరవ అధ్యక్షులు టి.రాముడు హాజ రయ్యారు .ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ మధ్య జరిగిన పార్లమెంట్ అసెంబ్లీ ఎన్నికల్లో కార్మిక , రైతు, ప్రజా వ్యతిరేక విధానాలు అనుస రించిన కేంద్రంలో ఉన్న బిజెపి, రాష్ట్రంలో ఉన్న వైసీపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా ప్రజలు తీర్పు ఇచ్చారన్నారు. రాష్ట్రంలో కొత్తగా ఏర్పడిన టిడిపి కూటమి ప్రభుత్వం కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేక విధానాలకు స్వస్తి పలకాలని అన్నారు. రాష్ట్రంలో లక్షలాది మంది తమ రెక్కల కష్టంతో పనిచేస్తున్న హమాలీ ముఠా కార్మికులకు వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేసి హమాలీ కార్మికులకు వెల్ఫేర్ అందే విధంగా చూడాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి దేశంలో ఉన్న కోట్లాదిమంది అసంఘటిత కార్మికులకు సమగ్రమైన చట్టం చేయాలని అన్నారు. గత రెండు సంవత్సరాలుగా కర్నూలు వ్యవసాయ మార్కెట్ యార్డ్ లారీ



మాట్లాడుతున్న సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ

హమాలీ యూనియన్ కార్మికుల సమస్యలపై ప్రజల సమస్యలపై జిల్లా సమగ్ర అభివృద్ధి కోసం చేసిన, రైతుల ఉద్యమానికి మద్దతుగా చేసిన పోరాటాలను సమీక్షించు కోవడం జరిగిందని, రాబోయే కాలంలో వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో కార్మికులు ఎదుర్కొంటున్న సమస్య పరిష్కారం కోసం కృషి చేయాలని పేర్కొన్నారు. హమాలీ కార్మికులకు పిఎఫ్, ఇఎస్ఐ సౌకర్యం కోసం, 10 లక్షల బీమా సౌకర్యం కోసం పోరాడాలని, తీర్మానించు కోవడం జరిగిందన్నారు.

అనంతరం వ్యవసాయ మార్కెట్ యార్డ్ లారీ హమాలీ యూనియన్ నూతన కమిటీని ఎన్నుకున్నారు. యూనియన్ గౌరవ అధ్యక్షులుగా టి.రాముడు,యూనియన్ అధ్యక్షులుగా ఎం.వెంకటేశ్వర్లు, కార్యదర్శిగా యు.బీసన్న, ఉపాధ్యక్షులుగా కే.కేశవులు, సహాయ కార్యదర్శిగా కే.మధు, ట్రెజరర్‌గా బికే.రామకృష్ణ, కమిటీ సభ్యులుగా బి.నాగన్న, కే.కృష్ణ, శ్రీనివాసులు, ముత్తయ్య, యోహాన్, కోదండ రాముడు, ఎల్లప్పలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కోత హమాలీ యూనియన్ నాయకులు నాగరాజు, వెంకటస్వామి, వలి, హమాలీ నాయకులు దస్తగిరి, కిట్టు, లచ్చు మద్దిలేటి, శివ శేఖర్, 165 మంది హమాలీలు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం

- టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని నియోజకవర్గంలో క్షేత్రస్థాయిలో టిడిపిని బలోపేతం చేస్తామని ఆ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు మాజీ ఎమ్మెల్యే నియోజకవర్గ ఇన్చార్జి మీనాక్షి నాయుడు తెలిపారు. ఆదోని మండిగిరి మున్సిపల్ కాలనీ 18వ వార్డుకు చెందిన తలారి వేణు కుటుంబ సభ్యులు ఆదివారం తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, రాష్ట్ర ఉపాధ్యక్షులు మీనాక్షి నాయుడు సమక్షంలో పార్టీలో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా పార్టీలో ఆహ్వానించారు. ఆదోని అభివృద్ధికి అందరూ కలిసికట్టుగా పనిచేద్దామన్నారు. కాలనీ యువకులు తలారి గిరి, చరణ్, శివా, నగేష్, మురళీ, కాలనీ తెలుగుదేశం కార్యకర్తలు భారీగా తరలివచ్చారు.

టిడిపిలోకి చేరికలు

ఆదోని నియోజవర్గంలో వైసిపి నుండి టిడిపిలో 150 కుటుంబాలు ఆదివారం ఆదోని పట్టణంలో టిడిపి ఇంచార్జ్, రాష్ట్ర తెలుగుదేశం పార్టీ ఉపాధ్యక్షుడు మీనాక్షి నాయుడు సమక్షంలో టిడిపిలో చేరాయి. పార్టీ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఆదోని అభివృద్ధికి కలిసికట్టుగా పాటుపడతామన్నారు. మాజీ కౌన్సిలర్ అంజని, నాగ లా పురం గ్రామం నుండి వెంకటేష్, జనార్ధన్, చిన్న వీరేష్, పెద్ద వీరేష్, శ్రీనివాసులు, తిమ్మప్ప, చిన్ని రామాంజనేయులు, పెద్ద ఊరుకుంద, మోహన్, వెంకట రాముడు, గోవిందు ఉన్నారు.

తైక్వాండోతో మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం

-పోటీలను ప్రారంభించిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి

ప్రజాశక్తి-కర్నూలు జిల్లాపరిషత్

తైక్వాండో వల్ల మానసిక ఉల్లాసం, శారీరక దృఢత్వం కలుగుతుందని మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ శమంతకమణి అన్నారు. ఒలంపిక్ డే సందర్భంగా కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ వారి ఆధ్వర్యంలో అవుట్డోర్ స్టేడియంలో నిర్వహించిన తైక్వాండో పోటీలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ విద్యార్థులు విద్యార్థి దశ నుండి క్రీడలలో రాణించాలని తైక్వాండో నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం మానసిక ఉల్లాసం చెందుతారని తెలిపారు. ఈ కార్యక్రమంలో కర్నూలు జిల్లా ఒలంపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శ్రీనివాసులు, సునీల్, న్యాయవాది శ్రీధర్,యుఆర్‌బి ఫౌండేషన్ అధ్యక్షులు ఊట్ల రమేష్ బాబు, డిఎస్‌డిఒ భూపతిరావు, క్రేడాయ్ అధ్యక్షులు సాయిరాం రెడ్డి, ప్రధాన కార్యదర్శి బ్రిజేష్ సింగ్, మాస్టర్లు సతీష్ కుమార్,



వీరేష్‌బాబు, వెంకట తిమ్మారెడ్డి, శివ,పరమేష్, రాంబాబు, సుందర్రాజు, చంద్రశేఖర్, విద్యార్థులు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

గ్రామాభివృద్ధిలో భాగస్వాములు కావాలి

ప్రజాశక్తి- దేవనకొండ

గ్రామాభివద్ధిలో గ్రామస్తులు అందరూ భాగస్వాములు కావాలని కర్నూలు జిల్లా వినియోగదారుల కమిషన్ సభ్యులు న్యాయవాది నారాయణరెడ్డి, మాజీ సర్పంచ్ బాట మీద రాజన్న అన్నారు. మండలంలోని తెర్నేకల్ గ్రామంలో ఆదివారం ఎల్లమ్మ పేట వీధిలోని ఎల్లమ్మ ఆలయ అభివృద్ధిపై ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జన్మించిన ఊరిని మర్చి పోకూడదన్నారు. గ్రామ అభివృద్ధిలో తమ వంతు సహకారం అందిస్తామన్నారు. ఆలయ శిఖర నిర్మాణానికి రూ. 25 వేలను వినియోగదారుల కమిషన్ సభ్యులు న్యాయవాది నారాయణరెడ్డి అందించారు. అదేవిధంగా ఆలయ గోపుర నిర్మాణం పూర్తయిన తర్వాత రంగులు వేయిస్తామని హామీ ఇచ్చారు. 2017సంవత్సరంలో సర్పంచ్‌గా పనిచేసిన రాజన్న కళ్యాణ మండపాన్ని నిర్మించడం జరిగిందని కమిటీ సభ్యులు తెలిపారు. ప్రతి ఒక్కరూ ఆలయ అభివృద్ధికి సహకరిస్తామని సమావేశంలో పాల్గొన్న గ్రామస్తులు తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్ మాదన్న, గ్రామ పెద్దలు హనుమన్న, లక్ష్మన్న, పూజారి నారాయణస్వామి, వాసు, చిన్న హనుమంతు, పుల్లాపురం కిష్టన్న పాల్గొన్నారు.


విరాళం అందజేస్తున్న నారాయణరెడ్డి